
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 34.0
కనిష్ఠం 24.0
***

ANDHRAJYOTHY



నల్లగొండ

3

గురువారం 4 జూలై 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	504 (121.7080)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.58 (2.69)	నిల్	నిల్
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	95.14 (0.42)	3,194	50

చికెన్ ధరలు | లైవ్ : రూ.134 | డ్రెస్ : రూ.194 | స్కిన్‌లెస్ : రూ.224

రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. గతంలో యూరియా కోసం గంటల కొద్దీ క్యూలైన్లలో నిలబడి, ఒకటి, అర బస్తాలను తీసుకొని వెళ్లేవారు. అవికూడా సరిపోకపోవడంతో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వచ్చేది. ఇక నుంచి ఆ కష్టాలకు చెక్‌పెట్టాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిర్ణయించింది. వానాకాలంలో రైతులకు యూరియా, కాంప్లెక్స్ ఎరువుల కొరత లేకుండా ప్రణాళిక రూపొందించింది. ఇప్పటికే వ్యవసాయ శాఖ బఫర్‌స్టాక్‌లు సిద్ధం చేసింది. పక్కదారి పట్టకుండా నిరంతరం పర్యవేక్షణకు అధికారుల బృందాన్ని ఏర్పాటు చేసింది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)



యూరియా ఇక.. అడిగినంత



ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే అందుబాటులో ఉన్న యూరియా, కాంప్లెక్స్ ఎరువుల నిల్వలు

జిల్లా	యూరియా	డీఏపీ	ఎన్‌పీకే	ఎంవోపీ	ఎస్‌ఎస్‌పీ	మొత్తం
నల్లగొండ	57,004	5,907	29,734	1,842	835	95,323
సూర్యాపేట	35,098	2,885	14,535	624	561	53,703
యాదాద్రి	13,628	1,395	5,589	446	215	21,271
మొత్తం	1,05,730	10,187	49,858	2,912	1,611	1,70,297

- రైతులకు సీజన్‌లో కొరతలేకుండా చర్యలు
- బఫర్ స్టాకులు సిద్ధం చేసిన వ్యవసాయశాఖ
- పక్కదారి పట్టకుండా నిరంతర మానిటరింగ్
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 1.05లక్షల మెట్రిక్‌టన్నుల యూరియా సిద్ధం
- సమృద్ధిగా అందుబాటులో కాంప్లెక్స్ ఎరువులు

వానాకాలంలో రైతులకు సమృద్ధిగా యూరియా, కాంప్లెక్స్ ఎరువులు అందించేందుకు వ్యవసాయశాఖ సిద్ధమైంది. గత నాలుగేళ్ల వినియోగాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ సీజన్‌లో ఎంతమేరకు అవసరమవుతుందన్న అంచనాతో యూరియా, ఇతర ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచేందుకు ప్రణాళిక తయారు చేసింది. వానాకాలంలో వినియోగించేందుకు అవసరమైన ఎరువుల్లో దాదాపు 70శాతంవరకు ఇప్పటికే బఫర్ స్టాక్స్ గోదాములకు తరలించింది. రైతులు ఏ సమయంలో ఎంత పరిమాణంలో యూరియా, కాంప్లెక్స్ కావాలన్నా కొరతలేకుండా అందించేలా చర్యలు చేపట్టింది. గతేడాది వరకు అమల్లో ఉన్న విధానంపై సమీక్ష జరిపి ఒకవైపు డీలర్లకు, మరోవైపు మార్క్‌ఫెడ్ ద్వారా చెరిసగం ఎరువులు, యూరియా కేటాయించేలా చర్యలు తీసుకుంది. మొత్తంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈ వానాకాలంలో రైతులకు ఎలాంటి కొరత లేకుండా యూరియా, కాంప్లెక్స్ ఎరువులు అందిస్తామని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

డీలర్లు, మార్క్‌ఫెడ్‌కు చెరి సగం కేటాయింపులు

ఎరువులు, యూరియా సరఫరాలో ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఎరువుల కేటాయింపులపై వ్యవసాయశాఖ ఈసారి కొన్ని మార్పులు చేపట్టింది. గతేడాది వరకు ఎరువుల కేటాయింపుల్లో మార్క్‌ఫెడ్‌కు 60 శాతం, డీలర్లకు 40 శాతం ఎరువులు అందించేవారు. అయితే మార్కెటింగ్‌లో, రైతులకు ఎరువులు అందించే విషయంలో డీలర్ల వినియోగమో ఎక్కువగా ఉండడం, మార్క్‌ఫెడ్‌కు కేటాయించిన నిల్వలు భారీగా పేరుకుపోవడం వంటి అంశాలను గుర్తించిన వ్యవసాయ శాఖ కేటాయింపులపై సమీక్ష జరిపి ఈ సీజన్ నుంచి మార్క్‌ఫెడ్‌కు 50శాతం, డీలర్లకు 50శాతం చొప్పున సమానంగా యూరియా, ఎరువులు అందించాలని నిర్ణయించింది.దీంతో రైతులకు కొనుగోళ్ల విషయంలో కోటా గానీ, కొరతగానీ ఉండదని అవసరమైనంత మేరకు వారికి నచ్చిన చోట కొనుగోళ్లు చేయవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

యూరియా పక్కదారి పట్టకుండా నిరంతర పర్యవేక్షణ

వానాకాలంలో అత్యధికంగా వినియోగముండే యూరియా పక్కదారి పట్టకుండా కట్టుదిట్టమైన చర్యలను వ్యవసాయాధికారులు చేపట్టారు. దుకాణాలకు, సంఘాలకు యూరియా కేటాయింపులు జరిగాక విక్రయాలపై నిరంతర పరిశీలన కొనసాగించేలా చూస్తున్నారు. ప్రతీ మండల వ్యవసాయాధికారి తన పరిధిలోని సంఘాల విక్రయాలను, డీలర్ల విక్రయాలను వారంలో ఒకసారి పరిశీలించి నిల్వలు సరిచూడాలని ఆదేశించారు. జిల్లా వ్యవసాయాధికారి, డివిజనల్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, ఫిర్యాదులు వస్తే తక్షణం విచారణ జరిపి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

సీజన్‌లో యూరియా కొరత లేకుండా నిల్వలు సిద్ధం



జిల్లాలో ఈ సీజన్‌లో ఎలాంటి యూరియా కొరత రాకుండా ముందస్తుగా సిద్ధమయ్యాం. ఈ ఏడాది 75 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవుతుందనే అంచనాతో ఇప్పటికే 57వేల మెట్రిక్‌టన్నుల యూరియాని అందుబాటులో ఉంచాం. ఇందులో 12వేల మెట్రిక్‌టన్నుల యూరియా సంఘాలు, డీలర్లకు చేరింది. ప్రతీ బస్తా రైతులకు చేరేలా అన్నిచర్యలు తీసుకున్నాం. ఈనెలలో మరో నాలుగు ర్యాక్‌ల యూరియా అందుబాటులోకి వస్తుంది. సీజన్‌లో రైతులకు ఎక్కడ వీలైతే, ఎక్కడ కొంత అవసరముంటే అంత యూరియా అందించేందుకు అన్నిచర్యలు తీసుకున్నాం. నిరంతరం మానిటరింగ్ చేస్తున్నాం. కాంప్లెక్స్‌ఎరువుల పైన కూడా పర్యవేక్షణ కొనసాగుతోంది. యూరియా, కాంప్లెక్స్ ఎరువుల విషయంలో రైతులకు ఎలాంటి ఆందోళన అవసరంలేదు. ఎంత కావాలన్నా సమీపంలో డీలర్ల వద్ద, సంఘాల వద్ద అందుబాటులో లభించేలా చర్యలు తీసుకున్నాం.

- శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి, నల్లగొండ

నాలుగేళ్ల వినియోగం ఆధారంగా ఈ సీజన్ డిమాండ్ అంచనా

గత నాలుగేళ్ల వినియోగం ఆధారంగా ఈ సీజన్‌లో సాగువిస్తీర్ణం అంచనా, తద్వారా ఎరువులు, యూరియా ఎంతమేర అవసరముంటాయనే అంచనాలను వ్యవసాయాధికారులు రూపొందించారు. నల్లగొండ జిల్లాలో ఈ ఖరీఫ్‌లో 75వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరముంటుందని అంచనావేసి, అందుకనుగుణంగా సరఫరాకు ప్రణాళిక అమలు చేస్తున్నారు. ఒక్క నల్లగొండ జిల్లాకే ఇప్పటికే యూరియా 57వేల మెట్రిక్ టన్నులు అందుబాటులోకి వచ్చిందని, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలకు ఇదే నిష్పత్తిలో నిల్వలు అందుబాటులో ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. మొత్తంగా ఉమ్మడి జిల్లా అవసరాల నిమిత్తం ఇప్పటికే 1.05లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని వివరించా రు. కాంప్లెక్స్ ఎరువుల విషయంలో ఎలాంటి కొరత ఉండదని, ఓపెన్ మార్కెట్‌లో ఎంతంటే అంత అందుబాటులో ఉంటుందని వివరిస్తున్నారు.

మండల, జిల్లా పరిషత్‌లలో ప్రత్యేకాధికారుల పాలన

- నేటితో ముగియనున్న జడ్పీటీసీలు, చైర్మన్ల పదవీకాలం
- నేడు మండల పరిషత్, రేపు జడ్పీల్లో ప్రత్యేకాధికారులకు బాధ్యతలు
- ఉత్తర్వులు జారీ



నల్లగొండ, జూలై 3 : పాలకవర్గాల పదవీకాలం నేటితో ముగుస్తుండటంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అన్ని మండల ప్రజాపరిషత్‌లకు, జిల్లా పరిషత్‌లలో ప్రత్యేకాధికారుల పాలనకు రంగం సిద్ధమైంది. ఇందుకు సంబంధించి ప్రత్యేకాధికారుల నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామపంచాయతీల మాదిరిగానే మండల, జిల్లా పరిషత్‌ల్లోనూ ప్రత్యేకాధికారుల పాలనకు సన్నాహాలు పూర్తయ్యాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 73 మండలాలకు, జిల్లాస్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించనుండగా నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలో జడ్పీ చైర్మన్ల పదవీకాలం గురువారంతో ముగుస్తుండటంతో కలెక్టర్లకు బాధ్యతలను అప్పగించనున్నారు. ఈ నెల 4వ తేదీ నుంచి మండల పరిషత్‌లకు స్పెషల్ ఆఫీసర్లు బాధ్యతలు చేపట్టనున్నారు. జడ్పీలకు సంబంధించి చైర్మన్ల స్థానంలో కలెక్టర్లు ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈనెల 5వ తేదీన బాధ్యతలు చేపట్టనున్నారు. ఎంపీపీ, ఎంపీటీసీల పదవీకాలం 3వ తేదీతో ముగియగా, జడ్పీటీసీలు, జడ్పీచైర్మన్‌ల పదవీకాలం 4వ తేదీతో ముగుస్తుంది. ఈ నేపథ్యంలో ప్రత్యేకాధికారులకు బాధ్యతలు అప్పగిస్తున్నారు. 2019 సంవత్సరం మే నెలలో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికల నిర్వహించిన విషయం తెలిసిందే. అదే ఏడాది జూలై మాసంలో 3వ తేదీన మండల పరిషత్ పాలకవర్గాలు ఏర్పడగా జూలై 4వ తేదీన జిల్లా పరిషత్ పాలకవర్గాలు ఏర్పడ్డాయి. బీసీ రిజర్వేషన్ల అంశంతో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ముడిపడి ఉండటంతో ఇప్పటికే గ్రామపంచాయతీ ఎన్నికలు వాయిదా వేసిన ప్రభుత్వం జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు వాయిదా వేసి ప్రత్యేకాధికారులను నియమిస్తుంది.

జిల్లాలో ప్రత్యేకాధికారులు వీరే

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

నల్లగొండ, జూలై 3 : జిల్లాలో బుధవారంతో మండల పరిషత్ అధ్యక్షుల కాలపరిమితి ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ సీ నారాయణరెడ్డి మండలాలకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం వీరంతా బాధ్యతలు స్వీకరించనున్నారు.

మండలం - అధికారి

అడవిదేవులపల్లి - పీ.శ్రీకాంత్,
అనుములకు - కే.సత్యనారాయణ,
చందంపేట - శ్యాముల్ జాకబ్,
చండూరు- ఆర్.రామకృష్ణ,
చింతపల్లి -బీ.సక్కుబాయి
చిట్యాల- పీ.శ్రవణ్ కుమార్
దామరచర్ల- శ్యాంసుందర్,
దేవరకొండ- ఇందిరా
గుండ్లపల్లి- ఎం.వీరప్ప,
గుర్రంపోడు -వీ.వెంకటేశ్వర్లు,
కనగల్ - వీ.శ్రీనివాస్,
కట్టంగూరు- విజయేందర్‌రెడ్డి
కేతేపల్లి -డీ.నాగేశ్వర్‌రావు
కొండమల్లేపల్లి- ఎస్.ద్వారక్
మాడ్గులపల్లి-మహేందర్‌కుమార్
మర్రిగూడ - డీ.ఎల్లయ్య,
మిర్యాలగూడ - జే.వెంకట్‌రెడ్డి,
మునుగోడు - కే.మురళీ,
నకిరేకల్ - ఎస్.కిరణ్‌కుమార్,
నల్లగొండ - జీ.సంగీతలక్ష్మి
నాంపల్లి - కే.శ్రీనివాస్,
నార్కట్‌పల్లి - వీ.రమేష్,
నేరడుగొమ్ము - నితిన్‌కుమార్,
నిడమనూర్ - వీ.శ్రీనివాసరావు,
పీఏపల్లి - నాగమల్లేశ్వర్‌రావు,
పెద్దవూర - వెంకటయ్య,
శాలిగౌరారం- రామారావునాయక్,
తిప్పర్తి - ఆర్.దస్రు,
తిరుమలగిరి(సాగర్)-కిరణ్‌కుమార్,
త్రిపురారం- వీ.లీల,
వేములపల్లి - డీ.శ్రీనివాస్‌రావు



వర్షాలతో మెట్ట పంటలకు ఊరట

- ఇప్పటివరకు 2.60లక్షల ఎకరాల్లోనే పత్తి సాగు
- వర్షాలు లేక ఇంకా 2.80 లక్షల ఎకరాల్లో పడని విత్తనాలు
- సమృద్ధిగా వర్షాలు కురవకపోవడంతో ఆందోళనలో రైతులు

నల్లగొండ, జూలై 3 : జిల్లాలో ఈ వానాకాలంలో విచిత్రమైన పరిస్థితులు నెలకొన్నాయి. అడపాదడపా కురుస్తున్న వర్షాలు మెట్ట పంటలకే కాస్త ఊరట ఇస్తున్నపటికినీ సమృద్ధిగా వర్షాలు కురవకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జూన్ 1 నుంచి ఇప్పటివరకు జిల్లాలో 91.3మిల్లీమీటర్ల(మి.మీ) వర్షపాతం నమోదుకు 166.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. 81.7మి.మీల అధిక వర్షపాతం నమోదైనట్లు రికార్డులు చూపిస్తున్నాయి.అయితే భారీ వర్షాలు లేకపోవడంతో చెరువులు, కుంటలు నిండని పరిస్థితి నెలకొంది. చిట్యాల,నార్కట్‌పల్లిలో మాత్రమే తక్కువ వర్షపాతం నమోదు కాగా మిగతా అన్ని మండలాల్లోను పడాల్సిన వర్ష కంటే అధికంగానే వాన పడిందని వాతావరణ శాఖ పేర్కొంటుంది.అయితే ఈ వర్షాలు పత్తి పంటకు మాత్రమే ప్రయోజనం చేకూరుస్తుండగా, వరి సేద్యానికి, పొలాల దున్నకానికి మాత్రం ఏమాత్రం ఉపయోగపడటం లేదు. మోస్తరు నుంచి భారీ వర్షాలు పడితే వరి నాట్ల కోసం పొలాలు దున్నుకునే అవకాశాలు ఉంటాయి. కానీ ఏమాత్రం వర్షాలు సమృద్ధిగా పడటం లేదు. డివిజన్ల వారీగా పరిశీలిస్తే నల్లగొండ డివిజన్‌లో ఈ నెల రోజుల్లో 1264.2 మి.మీలు వర్షం కురిసింది. ఈ డివిజన్‌లో 49.0మి.మీల వర్షం అధికంగా పడిందంటున్నారు. మిర్యాలగూడ డివిజన్‌లో 1780.7మి.మీలు కురవగా 109.3మి.మీల వర్షం అధికంగా కురిసినట్లు సీపీవో కార్యాలయం పేర్కొంటుంది. ఇకపోతే దేవరకొండ డివిజన్‌లో 1333.3మి.మీలు వర్షపాతం నమోదైంది. ఈ డివిజన్‌లో కూడా 99.8మి.మీలు వర్షం అధికంగా పడింది. చండూరు డివిజన్‌లోని ఐదు మండలాల్లో 767.7 మి.మీల వర్షపాతం కురవగా ఈ ఇక్కడా 67.3మి.మీల అత్యధిక వర్షపాతం నమోదు అయినట్లు అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలో సగటున 5,145.9మి.మీల వర్షపాతం కురిసింది. జిల్లాలో మొత్తం 81.7మి.మీల వర్షం అధికంగా నమోదు అయినప్పటికీ పరిస్థితులు కుదుట పడలేదు. ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో పత్తి సాగు కూడా ముందుకు సాగటం లేదు. మొత్తం 5.40లక్షల ఎకరాల్లో ఇప్పటికే పత్తి సాగు పూర్తి కావాల్సి ఉంది. అయితే 2.60లక్షల ఎకరాల్లో మాత్రమే విత్తనాలు వేయగా ఇంకా 2.80లక్షల ఎకరాల్లో విత్తనాలు వేయని పరిస్థితి నెలకొంది. ఈ నెలాఖరు వరకు కూడా పత్తి విత్తనాలు వేయవచ్చని ఎలాంటి నష్టం వాటిల్లిందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

సూర్యాపేట జిల్లాలో..

సూర్యాపేట జిల్లాలో రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు కొంత ఊపిరిపీల్చుకున్నారు. జూన్‌లో సాధారణ వర్షపాతం 96.1 మిల్లీమీటర్లు కాగా గతేడాది ఇదే నెలలో 60.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అయితే గింజలు మొలకెత్తె సమయంలో వర్షం కురవకపోవడంతో గింజలు వాడిపోయాయి. ఈ ఏడాది జూన్‌లో 96.1 మిల్లీమీటర్లకు 146.5 మిల్లీమీటర్ల వర్షం పడింది. అయితే మొదట కురిసిన వర్షాలే తప్ప ఆ తర్వాత వర్షాలు పడలేదు. జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో పత్తి పంటను 52,296 ఎకరాల్లో సాగు చేశారు. జూన్‌లో పడిన కొద్దిపాటి వర్షాలకు పత్తి విత్తనాలను విత్తారు. అవి అడపాదడపా పడిన వర్షాలకు మొలకెత్తాయి. అయితే అప్పుడప్పుడు కురిసిన వర్షాలకు చేన్లలో ఏపుగా కలుపుమొక్కలు పెరగడంతో రైతులు కూలీల సాయంతో వాటిని తీయించారు. అనంతరం పత్తి చేను పెద్దదిగా పెరగడం కోసం యూరియా, అడుగు మందు పిచికారీ చేశారు. ఇంతవరకు బాగానే ఉన్న పత్తి చేనుకు మందు వేసినప్పటి నుంచి ఇంతవరకు సరైన వర్షాలు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నాడు. అయితే రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు ఊరటచెందుతున్నారు.

యాదాద్రి జిల్లాలో...

యాదాద్రిభువనగిరి జిల్లాలో బుధవారం నాటికి సాధారణ వర్షపాతం 109.2 మి.మీ.లకు 120.8 మి.మీలు కురిసింది. జిల్లాలోని ఎనిమిది మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదుకాగా, ఏడు మండలాల్లో సాధారణం కంటే స్వల్పంగా వర్షపాతం నమోదైంది. ఆత్మకూరు, గుండాలలో సాధారణ కంటే తక్కువగా నమోదైంది. జిల్లాలో వరి 2.50 లక్షల ఎకరాల్లో, 1.50 లక్షల ఎకరాల్లో పత్తి సాగు అంచనా వేశారు. ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో ఇప్పటివరకు 1,70,254 ఎకరాల్లో వరిని సాగు చేసేందుకు ఏర్పాటుచేశారు. 81 ఎకరాల్లో నాట్లువేశారు. పత్తి 98,407 ఎకరాల్లో సాగుచేశారు. కందులు 538 ఎకరాలు, పెసర 21 ఎకరాలు, 80 ఎకరాల్లో కూరగాయలు, 46 ఎకరాల్లో జొన్నలు, 16 ఎకరాల్లో పశుగ్రాసం విత్తనాలను సాగుచేశారు. కాలం కలిసొస్తే ఇప్పటివరకు వరి నాటేందుకు పొలాలను సిద్ధం చేసుకోవాలి. అయితే జిల్లాలో భారీ వర్షాలు కురవకపోవడంతో చెరువులు, కుంటల్లోకి నీరు చేరలేదు. ఈ నేపథ్యంలో వరినారు నాటిన పక్షంలో నీరు లేక ఎండిపోయే ప్రమాదం ఉంది. ఈ నెలాఖరు వరకు వానాకాలం సీజన్ ఉంటుందని, జొన్న, పత్తి, మొక్కజొన్న తదితరులు పంటలు వేసుకోవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలువెల్లడిస్తున్నారు. ఈవారం రోజుల్లోగా విస్తారంగా వర్షాలు కురిస్తేనే రైతులు ఈసారి కరువు నుంచి గట్టెక్కే అవకాశముంది.

హాస్టల్ విద్యార్థులకు అన్నిసౌకర్యాలు కల్పించాలి

- కలెక్టర్ సీ నారాయణరెడ్డి
- తల్లిలా ఓపికతో ఉండండి

నల్లగొండ టౌన్, జూలై 3 : ప్రభుత్వ హాస్టల్లో ఉండే వారంతా దారిద్ర్యరేఖకు దిగువనున్న వారేనని, వారికి అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు వార్డెన్లు తల్లికున్నంత ఓపికతో ఉండాలని కలెక్టర్ సీ నారాయణ రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో సంక్షేమ హాస్టళ్ల అధికారులు, కేజీబీవీ పాఠశాలలు, మోడల్ పాఠశాలల ప్రిన్సిపాల్స్, సంబంధిత జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. హాస్టళ్లను సరైన విధంగా నిర్వహించాలని, కనీస సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. ఎక్కడా తాగునీరు కలుషితం లేకుండా చూసుకోవాలన్నారు. హాస్టల్ ఇల్లు లాంటిదని వాటి నిర్వహణ చాలా కష్టతరమైనప్పటికీ ప్రభుత్వం పేద విద్యార్థులకు సేవ చేసే భాగ్యాన్ని మనందరికీ కల్పించిందన్నారు. ప్రభుత్వమిచ్చిన అన్ని సౌకర్యాలు కల్పించి వారిని బిడ్డల్లా చూసుకోవాలన్నారు. భోజనం విషయంలో రాజీ పడవద్దని, హాస్టళ్లలో ఎక్కడైనా చిన్న చిన్న మరమ్మతులు ఉంటే తక్షణమే చేయించాలని, సాధ్యం కానివి జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఈ సంవత్సరం పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తామని, ఆ విధంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని, హాస్టళ్లలో సమస్యలను తొలగిస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ టీ పూర్ణచంద్ర, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖల ఇన్‌చార్జి అధికారులు, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ కోటేశ్వరరావు, హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, డీఈవో భిక్షపతి, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి విజయేందర్ రెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, కేజీబీవీ పాఠశాలలు, మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

అటవీభూములను పరిరక్షించాలి

జిల్లాలో అటవీ భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్ నుంచి వివిధ అంశాలపై వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించి పలుసూచనలు చేశారు. ఎక్కడా కూడా అటవీ భూములు అన్యాక్రాంతం కావడానికి అవకాశం ఇవ్వవద్దన్నారు. అన్యాక్రాంతంపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ఎఫ్‌ఆర్వోలు వారి పరిధిలో అటవీ భూముల సరిహద్దులను ఏర్పాటుచేయాలని, అటవీ భూముల పరిరక్షణలో అందరం కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఇసుక సరఫరాపై సమీక్షిస్తూ నిబంధనల ప్రకారమే సరఫరా చేయాలని, జిల్లాలో ఎక్కడా ఇసుక అక్రమ రవాణా జరుగవద్దన్నారు. సీజనల్ వ్యాధులపై మాట్లాడుతూ గ్రామ స్థాయి బృందాలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రత్యేకించి తాగునీరు, శానిటేషన్‌ను పరిశీలించి ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలన్నారు, కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అవసరమైన మేరకు ఎరువులు

వేములపల్లి/ మాడ్గులపల్లి, జూలై 3 : వర్షాకాల సీజన్‌కు అవసరమైన మేరకు యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని పీఏసీఎస్ కేంద్రాన్ని ఆయన సందర్శించి, ఎరువులను ఆయన పరిశీలించి, మాట్లాడారు. మారుతున్న కాలానుగుణంగా వ్యవసాయ రంగంలో నూతన యాజమాన్య పద్ధతులను పాటిస్తూ వరి సాగుకు ముందు దుక్కిలో జీలుగలు చల్లి పూత దశలో దమ్ము చేసి దున్నితే భూసారం పెరిగి అధిక దిగుబడి సాధించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎవరైనా నకిలీ విత్తనాలు, ఎరువులను విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏవోలు రుషేంద్రమణి, సైదానాయక్, సీఈవో రవీందర్‌రావు, ఏఈవో నితిన్, రాజు, శేఖర్, గిరిపాల్గొన్నారు. అదేవిధంగా మాడ్గులపల్లి మండలంలోని కుక్కడం గ్రామం లో పొలాలను జేడీఏ శ్రవణ్‌కుమార్ పరిశీలించారు. సేంద్రీయ వ్యవసాయంపై దృష్టి సారించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏవో సైదానాయక్, ఏఈవో పార్వతీ పాల్గొన్నారు.



వేములపల్లి పీఏసీఎస్ గోదాంలోని ఎరువులను పరిశీలిస్తున్న శ్రవణ్‌కుమార్

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యం



దేవరకొండలో గజమాలతో ఎమ్మెల్యే బాలునాయక్‌ను సన్మానిస్తున్న అభిమానులు

దేవరకొండ నియోజకవర్గ వ్యాప్తంగా ఎమ్మెల్యే బాలు నాయక్ జన్మదిన వేడుక లను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. దేవరకొండలో భారీ ర్యాలీ, గజమాలతో ఆయన స్వాగతం పలికారు. పలుచోట్ల కేక్‌లుకట్ చేసి పంపిణీ చేశారు.

ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలి

నల్లగొండ, జూలై 3 : స్పౌజ్ కోటాలో అవకాశాన్ని దుర్వినియోగం చేసిన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్య కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా చిట్యాల మండలం గుండ్రాంపల్లికి ఉపాధ్యాయుడిని బదిలీ చేశారన్నారు. జిల్లా విద్యాశాఖకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం లేదన్నారు. అధికారుల తీరును తప్పుపట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల ఐక్య సంఘ కమిటీ నాయకులు ఎం.రాజశేఖర్‌రెడ్డి, ఎడ్ల సైదులు, పెరుమాళ్ల వెంకటేశం, పీ.వెంకులు, ఖుర్షీద్‌మియా, నర్సింహ, భాస్కర్ గౌడ్, శంకర్‌గౌడ్, లక్ష్మీనారాయణ, శేఖర్‌రెడ్డి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



డీఈవో కార్యాలయం ఎదుట ఉపాధ్యాయుల నిరసన

మీసేవలు చేరువ చేసేందుకు

● మీసేవ కేంద్రాలను స్వయం సహాయక సంఘాలకు అప్పగించనున్న ప్రభుత్వం ● దూర భారం తగ్గించి సత్వర సేవలకోసం



భువనగిరి అర్బన్, జూలై 3: మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. మహిళ శక్తి పథకం ద్వారా ప్రభుత్వం తరుపున ఉపాధి కల్పిస్తూ వారి కుటుంబాల పోషణకు పరోక్షంగా సహాయ పడుతోంది. మహిళాశక్తి పథకంలో భాగంగా ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టే పనులు అప్పగించింది. క్యాంటీన్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టనుండగా మరో ముందడుగు వేస్తూ మీ-సేవ కేంద్రాలను అప్పగించేందుకు నిర్ణయించింది. ప్రస్తుతం మీ-సేవ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను మరింత చేరువ చేసేందుకు గ్రామీణ ప్రాంతాల్లో ఈ కేంద్రాలను నెలకొల్పనున్నారు. మండల కేంద్రాలు, పట్టణాలు, మేజర్ పంచాయతీలకే పరిమితమైన కేంద్రాలు గ్రామీణులకు దూర భారం, వ్యయ ప్రయాసలు తప్పించేందుకు గ్రామాల్లోనే ప్రభుత్వ కార్యాలయాల్లో స్వయం సహాయక సంఘాల ద్వారా అందుబాటులోకి రానున్నాయి.

రూ.2.50లక్షల రుణ సదుపాయం

మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళలకు ఆర్థిక చేయూతని చ్చేందుకు ప్రభుత్వమే రూ. 2.50లక్షల రుణాలను బ్యాంకులు లేదా స్త్రీనిధి ద్వారా అందించనుంది. ఈ నిధులతో అధికారుల పర్యవేక్షణలో కంప్యూటర్లు, ప్రింటర్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకోవాల్సి ఉంటుంది. మీ-సేవ కేంద్రాలు ప్రారంభించిన నాటినుంచి ఆయా సంఘాలు వాయిదాలు చెల్లించాల్సి ఉంటుంది. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించిన సభ్యులను ఆపరేటర్లుగా ఎంపిక చేస్తారు. నెల రోజులు శిక్షణ ఇచ్చి ఈ ఏడాది ఆగస్టు 15వరకు కొత్త మీ-సేవ కేంద్రాలు గ్రామీణులకు అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం భావిస్తోంది.

యాదాద్రిభువనగిరి జిల్లాలో..

యాదాద్రిభువనగిరి జిల్లాలోని ఆలేరు మండలం కొలనుపాక, బీబీనగర్, అడ్డగూడూరు, మండల కేంద్రం బొమ్మలరామారంతో పాటు మర్యాల, మోటకొండూరు, రామన్నపేట మండలం తుమ్మలగూడెం, సిరిపురం, వలిగొండ మండల మాదాపురంతో కలిపి మొత్తం తొమ్మిది కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. గ్రామ సంఘం ద్వారా ఎంపిక చేయనుండగా వీరికి శిక్షణ ఎప్పుడు.. ఎక్కడ ఇస్తారు..? దరఖాస్తుల స్వీకరణ ఎప్పుడనేదీ త్వరలో ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయనున్నట్లు డీఆర్డీవో ఎం.ఏ. క్రిష్ణన్ తెలిపారు.

మండలకేంద్రాలు, పట్టణాల్లో ఉండడంతో..

ప్రస్తుతం జిల్లాలో 69 కేంద్రాల ద్వారా ప్రజలకు సేవలు అందుతుండగా అధికంగా మండల కేంద్రాలు, పట్టణ ప్రాంతాల్లోనే ఉన్నాయి. దీంతో గ్రామీణులకు పలు రకాల ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇతర సేవలకు దరఖాస్తు చేసుకోవాలన్నా మీ-సేవ ధ్రువపత్రాలు అవసరమవుతున్నాయి. ప్రభుత్వ పథకాల్లో లబ్ధిపొందేందుకు కేంద్రాల వద్ద ప్రజలు బారులు తీరుతున్నారు. దూరభారం తగ్గి వ్యయప్రాయాలు తప్పించేందుకు ప్రభుత్వ తాజా నిర్ణయంతో గ్రామీణ ప్రజలకు మీ-సేవ కేంద్రాలు మరింత దగ్గరకానున్నాయి.

గతంలో జనాభా లెక్కల ప్రకారం

2017 సంవత్సరం జనాభా లెక్కల ప్రకారం జిల్లా ఆవిర్భావం మొదట్లో 17 మండలాల్లో 18 కేంద్రాలు ఏర్పాటు చేయగా, తర్వాత అవి 69కి చేరాయి. 2019 సంవత్సరంలో ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వుల మేరకు మరో 17కు విస్తరించాలని యోచించారు. 2022 ఆగస్టులో వాటి విస్తరణకు నోటిఫికేషన్ జారీ చేయగా సుమారు 600మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. విడుదల చేసిన నోటిఫికేషన్‌కు వ్యతిరేకంగా యాదగిరిగుట్ట మీ-సేవ కేంద్రాల నిర్వాహకులు కోర్టును ఆశ్రయించారు. దీంతో మిగితా కేంద్రాల విస్తరణ కూడా నిలిచిపోయింది.

ఆదేశాలు అందగానే కార్యకలాపాలు మొదలు అవుతాయి

ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందగానే కార్యకలాపాలు మొదలు అవుతాయి. కొత్తగా ఏర్పాటు కాబోయే మీ-సేవ కేంద్రాల ద్వారా గ్రామీణులకు సేవలు మరింత చేరువకానున్నాయి. త్వరలో మహిళ శక్తి పథకంలో భాగంగా స్వయం సహాయక సంఘాలకు మీ-సేవ కేంద్రాల నిర్వాహణ బాధ్యతలు అప్పగించే ప్రక్రియ మొదలవుతుంది.

● ఎం.ఏ. క్రిష్ణన్, డీఆర్డీవో యాదాద్రిభువనగిరి జిల్లా.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

● నృసింహుడిని దర్శించుకున్న ఎమ్మెల్సీ సురభి వాణీదేవి

భువనగిరి అర్బన్, జూలై 3: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్య కైంకర్యాలు పాంచరాత్రాగమశాస్త్ర రీతిలో వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవార్లను దివ్యమనోహరంగా అలంకరించి, ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్యతిరుకల్యాణోత్సవ పర్వాలు ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 18,82,227 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు. కాగా, మాజీ ప్రధాని పీవీ.నరసింహారావు కుమార్తె, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి లక్ష్మీనృసింహుడిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వేద పండితులు ఆమెకు వేదాశీర్వచనం చేయగా ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు లడ్డూ ప్రసాదం అందజేశారు.



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

జెడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయుల వాగ్వాదం?

చిట్యాలరూరల్, జూలై 3: పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులు ఒక విషయంలో చర్చలు జరుగుతున్న సమయంలో వాగ్వాదం జరిగిన దాడిచేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ ఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో బుధవారం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా ఉండి ఇటీవలే రిటైర్డ్ అయిన అప్పటి ప్రధానోపాధ్యాయుడు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాక వాటికి సంబంధించిన అంశాలను వివరించేందుకు నిర్వాహణ గురించి వివరించేందుకు పాఠశాలకు వచ్చి స్థానిక పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశమై చర్చిస్తున్నారు. ఉపాధ్యాయులతో చర్చిస్తున్న సమయంలో అందులో ఉన్న ఓ ఉపాధ్యాయుడు నిబంధలను విరుద్ధంగా స్పౌజ్‌ను ఆప్షన్‌ను వినియోగించుకుని ఇటీవల పాఠశాలకు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయుడిని ఎలా నియమిస్తారని రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడితో అన్నారు. దానిపై విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినందున ఆయను ఎలా నియమిస్తారని అన్నారు. అక్కడే ఉన్న పలువురు ఉపాధ్యాయులు ఈ విషయం ప్రస్తుతం అనవసరమని అనడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఒకానొక దశలో ఒక ఉపాధ్యాయుడు మరో ఉపాధ్యాయుడిపై కుర్చీని ఎత్తడంతో అక్కడున్న వారు కలుకజేసుకుని వారించారు. ఉపాధ్యాయులు వాగ్వాదం చేసుకుంటే ఎలా అని అక్కడున్న ఉపాధ్యాయులంతా కలుగజేసుకోవడంతో వివాదం సద్దుమణిగింది.

నాడు తల్లి.. నేడు తండ్రి మృతి

● అంత్యక్రియలు నిర్వహించిన కుమార్తె ● కాలనీవాసుల చందాలతో నిర్వహణ

హుజూర్‌నగర్, జూలై 3: పేద కుటుంబానికి చెందిన ఆ బాలిక చిన్నతనంలోనే తల్లిని కోల్పోయి నానమ్మ సంరక్షణలో ఉంది. నేడు తండ్రి అనారోగ్యంతో మృతి చెందడంతో ఒంటరైంది. అంత్యక్రియలు నిర్వహించే స్థోమత లేకపోవడంతో కాలనీవాసులే చందాలతో అంత్యక్రియలకు ఏర్పాటు చేశారు. 12ఏళ్ల కుమార్తె తండ్రి అంత్యక్రియలు నిర్వహించడం అందరి హృదయాలను ద్రవింపజేసింది. బుధవారం హుజూర్‌నగర్ పట్టణంలో ఈ ఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణంలోని ఎంపీపీ కాలనీకి చెందిన ఉదారి క్రాంతికుమార్(35), పార్వతి దంపతులకు 13ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి 12 సంవత్సరాల కుమార్తె జ్యోత్స్న ఉంది. క్రాంతికుమార్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించేవాడు. జ్యోత్స్న చిన్నతనంలోనే తల్లి పార్వతి మృతి చెందింది. దీంతో క్రాంతి మద్యానికి బానిసయ్యాడు. 70ఏళ్ల వృద్ధురాలైన క్రాంతి తల్లి పుష్పమ్మ చిన్న బడ్డీ కొట్టు నడుపుతూ మనవరాలు జ్యోత్స్నకు అండగా ఉంది. ఆమెను పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదివిస్తోంది. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న క్రాంతి బుధవారం ఉదయం మృతి చెందాడు. అంత్యక్రియలు చేసేందుకు కూడా ఆ కుటుంబం ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో కాలనీవాసులందరూ కలిసి అంత్యక్రియలకు ఏర్పాటు చేశారు. అంత్యక్రియలు నిర్వహించే సమయంలో తండ్రి మృతదేహంపై పడి చిన్నారి జ్యోత్స్న విలపించిడం అక్కడి వారిని చలింపజేసింది. చిన్నప్పుడే తల్లిని కోల్పోయిందని, ఇప్పుడు ఆమెకు అండగా ఉండాల్సిన తండ్రి లేడని, వృద్ధురాలైన నానమ్మ బాలికను ఎలా పెంచి పోషిస్తుందని, పాఠశాలకు ఎలా పంపుతుందని స్థానికులు చర్చించుకుంటూ.. బాలిక పరిస్థితిని చూసి అయ్యో.. పాపం.. అంటూ ప్రతి ఒక్కరూ ఆవేదన వ్యక్తంచేశారు.



తండ్రి అంత్యక్రియలు నిర్వహిస్తున్న జ్యోత్స్న

డీసీసీబీ చైర్మన్‌కు రాజగోపాల్‌రెడ్డి సన్మానం

మునుగోడు రూరల్, జూలై 3: నల్లగొండ డీసీసీబీ చైర్మన్‌గా ఎన్నికైన కుంభం శ్రీనివాస్‌రెడ్డిని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సన్మానించారు. తనను డీసీసీబీ చైర్మన్‌గా ఎన్నుకునేందుకు సహకరించిన రాజగోపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపేందుకు డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లారు. బ్యాంకు ద్వారా రైతులకు అవసరమైన అన్ని సేవలు అందించాలని, సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని రాజగోపాల్‌రెడ్డి హామీ ఇచ్చారు.



శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

'మాటిచ్చా.. సరస్వతి గుడిని నిర్మించా'

- 'ఆంధ్రజ్యోతి'తో సినీ గేయ రచయిత చంద్రబోస్
- ఆయన స్వగ్రామం చల్లగరిగలో 'ఆస్కార్ గ్రంథాలయం'



ఆస్కార్ గ్రంథాలయం

చిట్యాల, జూలై 3: ఆస్కార్ అవార్డు గ్రహీత, సినీ గేయ రచయిత కనుకుంట్ల చంద్రబోస్ తన గ్రామ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. తన స్వగ్రామం జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగ గ్రామంలో సొంత నిధులతో ఆస్కార్ పేరిట ఓ గ్రంథాలయాన్ని నిర్మించారు. ఈ ఆస్కార్ గ్రంథాలయ ప్రారంభోత్సవం గురువారం జరగనుంది. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో బుధవారం ఫోన్‌లో మాట్లాడిన చంద్రబోస్.. 'గ్రామస్థులకు ఇచ్చిన మాట ప్రకారం సరస్వతి గుడిని నిర్మించా. చాలా సంతోషంగా ఉంది' అని ఆనందం వ్యక్తం చేశారు. చల్లగరిగలోని తమ ఇంటి పక్కన ఉన్న గ్రంథాలయంలో ఎన్నో సాహిత్య పుస్తకాలు చదివానని, వాటి వల్లే తాను ఉన్నత స్థాయికి ఎదిగానని ఈ సందర్భంగా చెప్పారు. ఆర్‌ఆర్‌ఆర్ సినిమాకు తాను రాసిన నాటునాటు పాటకు ఆస్కార్ అవార్డు రావడంతో బాల్య మిత్రులు, గ్రామ ప్రజలు తనని సన్మానించారని చెప్పారు. ఆ సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతూ గ్రామంలో అత్యాధునిక హంగులతో గ్రంథాలయ భవనం నిర్మిస్తానని ఇచ్చిన మాటను ఈ రోజున నిలబెట్టుకున్నానని వివరించారు. అందరి సహకారంతో రూ. 36లక్షల వ్యయంతో ఎనిమిది నెలల్లో భవనాన్ని సిద్ధం చేసి ఆస్కార్ గ్రంథాలయం అని నామకరణం చేశామని చెప్పారు. కాగా, రచయిత చంద్రబోస్ తన సొంత నిధులతో నిర్మించిన ఆస్కార్ గ్రంథాలయ ప్రారంభోత్సవం గురువారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని గ్రంథాలయాల జిల్లా కార్యదర్శి శ్రీలత తెలిపారు.

ఇద్దరు రైతుల ఉసురు తీసిన అప్పులు

పెంబి రూరల్, బొంరాస్‌పేట్, జూలై 3: పంటల కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఇద్దరు రైతులు బలవన్మరణానికి పాల్పడ్డాడు. నిర్మల్ జిల్లా పెంబి మండలం యాపల్‌గూడ గ్రామానికి చెందిన రైతు అర్క సంతోష్ (28) తనకున్న ఎకరంతో పాటు నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తి పంట వేశాడు. ఇందుకోసం రూ.లక్షల్లో అప్పు చేశాడు. పత్తి విత్తనా లు మొలకెత్తకపోవడంతో పాటు చేసిన అప్పులు తీర్చాలని బాకీలు ఇచ్చిన వారు వేధించడంతో మనస్తాపానికి గురై మంగళవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వికారాబాద్ జిల్లా మెట్లకుంట గ్రామానికి చెందిన బైరం నర్సింహులు(62)కు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. వారి వివాహాల కోసం చేసిన అప్పులు తీర్చేందుకు తనకు ఉన్న రెండు ఎకరాల పొలంలో ఎకరన్న సీలింగ్ భూమిని అమ్మకానికి పెట్టగా కొనుగోలుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపంతో బుధవారం ఉరేసుకున్నాడు.

ఉస్మానియా ఆస్పత్రిలో విద్యుత్ అంతరాయం

- టార్చ్‌లైట్ల వెలుగులో శస్త్రచికిత్సలు

మంగళ్‌హాట్, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా ఆస్పత్రిలో బుధవారం మధ్యాహ్నం విద్యుత్ నిలిచిపోవడంతో రోగులు, వైద్యులు ఉక్కిరిబిక్కిరయ్యారు. శస్త్రచికిత్సలు చేసే సమయంలో అంతరాయం కలగడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ నిలిచిన వెంటనే ప్రారంభం కావాల్సిన జనరేటర్లు సైతం మొరాయించాయి. సిబ్బంది వెంటనే విద్యుత్ విభాగం నిపుణులను రప్పించి అరగంట తర్వాత సేవలను పునరుద్ధరించారు. దీంతో అప్పటివరకు సెల్‌ఫోన్, టార్చ్‌లైట్ల వెలుతురులోనే శస్త్రచికిత్సలను కొనసాగించినట్లు సమాచారం.

'జికా'...వస్తోంది జాగ్రత్త

రాష్ట్రాలను అప్రమత్తం చేసిన కేంద్రం.. మహారాష్ట్రలో పెరుగుతున్న కేసులతో ఆందోళన

- సంసిద్ధంగాలేని తెలంగాణ వైద్యశాఖ
- కనీస చర్యలూ తీసుకోని వైనం
- ఇప్పటికే రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల విజృంభణ



హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పొరుగు రాష్ట్రం మహారాష్ట్రలో జికా వైరస్ విజృంభిస్తోంది. రెండు రోజుల క్రితం పుణెలో ఒక్క రోజే ఆరు జికా వైరస్ వ్యాధి (జడ్‌వీడీ) కేసులు నమోదుకావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. దీంతో అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం బుధవారం అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. ఈమేరకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్‌ఎస్) డాక్టర్ అతుల్‌గోయల్ అడ్వైజరీ జారీ చేశారు. జికాపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా గర్భిణులను స్క్రీనింగ్ చేయాలని కేంద్రం కోరింది. జికా వైరస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయిన గర్భిణుల్లో పిండం ఎదుగుదలను పర్యవేక్షించాలని సూచించింది. ప్రతి ఆస్పత్రిలో కచ్చితంగా ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించాలని, ఆ అధికారి జికా వైరస్ వ్యాప్తికి కారణమయ్యే దోమల పెరుగుదల నివారణకు చర్యలు చేపట్టాలని కోరింది. జికా కేసులు నమోదైతే వెంటనే నేషనల్ సెంటర్ ఫర్ వెక్టర్ బోర్న్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీవీబీడీసీ)కు రిపోర్టు చేయాలని, అనుమానిత నమూనాలను పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపాలని సూచించింది. అలాగే ఐసీఎంఆర్ ఆధ్వర్యంలోని వైరస్ పరిశోధనా కేంద్రాలకు కూడా శాంపిళ్లను పంపాలని ఆదేశించింది.

అప్రమత్తంగాలేని రాష్ట్ర వైద్యశాఖ..

మహారాష్ట్ర నుంచి తెలంగాణకు రోజూ వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఎంతో అప్రమత్తంగా ఉండాలి. ఇలాంటి మహమ్మారులు వచ్చినప్పుడు వాటిని నియంత్రించే బాధ్యత క్షేత్రస్థాయిలో ప్రజారోగ్య సంచాలకులకే ఉంటుంది. అయితే మన వద్ద ఇంతవరకు అందుకు సంబంధించిన కార్యాచరణేమీ కానరావడంలేదు. ఇప్పటికే రాష్ట్రంలో ఒకవైపు డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి సీజనల్ వ్యాధుల విజృంభణ మొదలైంది. గత ఐదు నెలల్లో మలేరియా, డెంగ్యూ మరణాలు కూడా సంభవించాయి. పటిష్ఠ పర్యవేక్షణ లేకపోవడంతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో వీటిపై అవగాహన ఉన్న విభాగాధిపతి లేకపోవడం ప్రధాన సమస్యగా మారిందని వైద్యవర్గాలు చెబుతున్నాయి. అందుకే సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దోమల ద్వారా వ్యాప్తి..

జికా వైరస్ అనేది దోమల ద్వారా సంక్రమించే ఫ్లేవి వైరస్. జికా ప్రధానంగా ఏడెస్ దోమల కాటు ద్వారా వ్యాపిస్తుంది. ఇదే దోమ కుడితే డెంగ్యూ, చికున్‌గున్యా, ఎల్లో ఫీవర్ వైరస్‌లు కూడా సోకుతాయి. జికా సోకితే సాధారణ లక్షణాలే ఉంటాయి. ఇవి 2-7 రోజులపాటు కనిపిస్తాయి. ముఖ్యంగా జ్వరం, దద్దుర్లు, కీళ్ల నొప్పి, కండ్లకలక (ఎరుపు కళ్లు), కండరాలు, తలనొప్పితో పాటు మరికొన్ని తీవ్రమైన సమస్యలు కలుగుతాయి. మైక్రోసెఫాలీ (పుట్టుక లోపం), గులియన్ బారే సిండ్రోమ్ (న్యూరోలాజికల్ డిజార్డర్), మెనింజైటిస్ (మెదడు, వెన్నెముక లైనింగ్ వాపు)లాంటి వాటికి కారణమౌతుంది.

నివారణ ఎలాగంటే..

దోమల వృద్ధిని నివారించడానికి ఇళ్లు, బహిరంగ ప్రదేశాల చుట్టూ నిలిచిన నీటిని తొలగించాలి. జికా కూడా లైంగికంగా సంక్రమించే అవకాశం ఉన్నందున సురక్షితమైన విధానాలను పాటించాలి. జికాకు నిర్దిష్ట చికిత్స లేదు, కానీ లక్షణాల ఆధారంగా చికిత్సను అందిస్తారు. జికా లక్షణాలు కనిపిస్తే వెంటనే సరైన రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకుని డాక్టర్‌ను సంప్రదించాలి.

పిడుగుపాటు కాదు.. అంతర్గత లోపమే

- 'భద్రాద్రి పవర్ ప్లాంట్' ప్రమాదంపై తేల్చిన జెన్‌కో..

హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ప్రమాదానికి అంతర్గత లోపాలే కారణమని తేలింది. పిడుగుపాటు వల్ల ప్రమాదం జరగలేదని జెన్‌కో స్పష్టం చేసింది. భద్రాద్రి పవర్ ప్లాంట్ ఒక్కోటి 270 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు యూనిట్లు (1080 మెగావాట్లు) ఉండగా.. అందులో 270 మెగావాట్ల సామర్థ్యం కలిగిన యూనిట్-1లోని జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ గత శనివారం అగ్ని ప్రమాదం జరిగి కాలిపోయింది. దీనికి పిడుగుపాటే కారణమని తొలుత ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ జెన్‌కో అధికారులతో విచారణ జరిపించారు. పిడుగు పడిన సమయంలోనే యాదృచ్ఛికంగా జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ అంతర్గత లోపాలతో, దాని లోపల మంటలు ఉత్పన్నమయ్యాయని, ఇందుకు బాహ్య కారణాలు లేవని తేల్చారు. దీనిపై ప్రభుత్వానికి జెన్‌కో తాజాగా ఓ నివేదిక సమర్పించింది. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఓ వ్యవస్థ దెబ్బతిని.. ఆయిల్ లీకేజీ చోటుచేసుకుని పూర్తిగా దగ్ధమైందని అందులో అధికారులు వివరించారు. ప్రాథమిక అంచనా ప్రకారం రూ.30 కోట్లకు పైగా నష్టం జరిగినట్టు ఇప్పటికే ఓ నిర్ధారణకు వచ్చారు. అయితే ట్రాన్స్‌ఫార్మర్‌ను పూర్తిగా విప్పి పరిశీలించిన తర్వాత నష్టంపై పూర్తి స్పష్టత రానుందని ప్రభుత్వానికి జెన్‌కో నివేదించింది. ట్రాన్స్‌ఫార్మర్‌లో అంతర్గత లోపాలు ఏర్పడడానికి నిర్మాణ, నిర్వహణ, పర్యవేక్షణ లోపాలు కారణమై ఉండవచ్చని భావిస్తున్నారు.

కుటుంబాన్ని మింగేసిన మద్యం రాకాసి

కాగజ్‌నగర్, జూలై 3: ఐదుగురు ఆడపిల్లల తండ్రి అయిన ఓ వ్యక్తి బాధ్యతలు మరచి మద్యానికి బానిసై వేధింపులకు గురి చేస్తుండడంతో జీవితంపై విరక్తి చెంది అతని భార్యాబిడ్డలు ఆత్మహత్యకు యత్నించారు. భార్య, ఓ కుమార్తె మరణించగా మరో ఇద్దరు కూతుళ్ల పరిస్థితి విషమంగా ఉంది. ఇలా కుమరం భీం జిల్లా కాగజ్‌నగర్ మండలం గజ్జిగూడ గ్రామానికి చెందిన ఓ కుటుంబాన్ని మద్యం మింగేసింది. వివరాలిలా ఉన్నాయి. గజ్జిగూడకు చెందిన ప్రతాప్‌కు భార్య అనిత(55), ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. వీరిలో పెద్ద కూతురికి వివాహమవ్వగా లక్ష్మి(21), రవళి(18), రమ్య(16), ఐశ్వర్య(14) ఇంటి వద్దే ఉంటున్నారు. మద్యానికి బానిసైన ప్రతాప్ తాగిన మైకంలో గ్రామస్థులతో నిత్యం గొడవలు పడుతుండేవాడు. ఆర్థిక ఇబ్బందులతో తమకున్న వ్యవసాయ భూమిలో కొంత భాగాన్ని అమ్మేశాడు. మిగిలిన కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేస్తూ అనిత కుటుంబాన్ని పోషించేది. ఈ క్రమంలో 15 రోజుల క్రితం పొలం వద్ద జరిగిన గొడవలో భాగంగా ప్రతాప్ ఓ వ్యక్తిపై గొడ్డలితో దాడి చేశాడు. దీంతో హత్యాయత్నం కేసులో ప్రతాప్ జైలుకెళ్లాడు. అయితే, గ్రామ ప్రజల సాయంతో ప్రతాప్‌కు బెయిల్ ఇప్పించిన అనిత భర్తను జైలు నుంచి బయటకు తీసుకొచ్చింది. ఆ తర్వాత కూడా ప్రతాప్ తీరుమారకపోవడంతో మద్యం మానేయాలంటూ అనిత సోమవారం గొడవపడింది. ఇందుకు ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రతాప్ భార్య అనితపై దాడి చేసి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన అనిత.. కుమార్తెలు రమ్య, లక్ష్మి, ఐశ్వర్య, రవళితో కలిసి పొలానికి వెళ్లి ఆత్మహత్య చేసుకుందామని చెప్పింది. రవళి మినహా తల్లీకూతుళ్లు అందరూ పురుగు మందు తాగేశారు. రవళి కేకలు విని అక్కడికి వచ్చిన చుట్టుపక్కల పొలాల్లోని వారు అనిత, ఆమె కుమార్తెలను ఆస్పత్రికి తరలించారు. అయితే, రెండ్రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అనిత, రమ్య బుధవారం మృతి చెందారు. లక్ష్మి, ఐశ్వర్య పరిస్థితి విషమంగా ఉంది. మరోపక్క, ప్రతాప్‌ను పోలీసులు అరెస్టు చేశారు.



సిద్దిపేట జిల్లా రాయపోల్‌లో గుర్తించిన సిడితల వీరగల్లు

తల నరుక్కొంటే.. శివ సన్నిధికి చేరుకుంటామని..

- చాళుక్యులు, రాష్ట్రకూటుల కాలంలో శైవుల్లో ఈ విశ్వాసం
- 'సిరితల వీరగల్లు'గా ప్రశస్తి.. సిద్దిపేట జిల్లా రాయల్‌పోల్‌లో విగ్రహం లభ్యం

రాయపోల్, జూలై 3: ప్రాణార్పన చేస్తే దేవుడి సన్నిధికి చేరుకుంటామని నమ్మడం.. ఓ పదునైన ఆయుధంతో తమ తలను తామే నరుక్కోవడమో.. మరొకరితో నరికించుకోవడమో చేయడం గురించి విన్నారా? 6వ శతాబ్దం నుంచి 12వ శతాబ్దం వరకు నడిచిన చాళుక్యుల కాలంలో, అప్పట్లోనే రాష్ట్రకూటుల హయాంలో శైవభక్తుల్లో ఈ విశ్వాసం ఉండేదట! భాసింపట్టు వేసుకున్న స్థితిలో తలపైన ఉన్న జుట్టు సాయంతో తాటిచెట్టుకో.. వెదురు చెట్టుకో వేలాడుతున్న వ్యక్తితో ఉన్న ఆ శిల్పాన్ని చూస్తున్నారా? ఆ వ్యక్తి చేతులు ముకుళితమై ఉన్నాయి. తల నుంచి మొండెం వేరయినట్లుగా మధ్యలో గ్యాప్‌ను స్పష్టంగా గమనించొచ్చు! ఈ శిల్పాన్ని 'సిడితల వీరగల్లు' అంటారు. శైవభక్తులు ఆత్మబలిదానాలను ధర్మకార్యంగా భావించేవారు. శివసన్నిధికి చేర్చే తక్షణ మార్గంగా ఆత్మబలిదానాలను ఎంచుకునేవారు. పైగా తల నరుక్కొని మరణిస్తే, తమ ప్రాణాలను తీసుకెళ్లేందుకు దేవాంగనలు వస్తారని విశ్వసించేవారు. ఈ శిల్పంలో.. పైన ఇద్దరు మహిళలుండటాన్ని గమనించవచ్చు! ఫొటోలో కనిపిస్తున్న ఈ 'సిడితల వీరగల్లు' సిద్దిపేట జిల్లా రాయపోల్‌లోని పురాతన గణపతి ఆలయం ప్రాంగణంలోనిది. దీన్ని కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధకుడు కొలిపాక శ్రీనివాస్ గుర్తించి.. వివరించారు. మహిళా సిడితల వీరగల్లులు జనగామ జిల్లా లింగపల్లిలో లభించాయి. పురుష సిడితల వీరగల్లులు ఇప్పటి దాకా యాదాద్రి జిల్లా చొల్లేరులో, వనపర్తి జిల్లా కేంద్రంలో లభించగా రాయపోల్‌లోనిది మూడోది. ఇక సిడితల వీరగల్లులు కాకుండా కేవలం వీరగల్లులూ ఉంటాయి. తోటి ప్రజలను, పాడిపశువులను కాపాడే క్రమంలో అడవి జంతువులతో పోరాడి చనిపోతే, యుద్ధాల్లో పాల్గొని ప్రాణాలు కోల్పోతే వారిని వీరగల్లుగా చెక్కి ప్రజలు ఆరాధించేవారు.

పెంటారెడ్డి పదవీకాలం ఆర్నెల్లు పొడిగింపు

నీటిపారుదలశాఖలో ఎత్తిపోతల పథకాల సలహాదారుడు కె.పెంటారెడ్డి పదవీ కాలాన్ని మరో ఆర్నెల్ల పాటు పొడిగిస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పెంటారెడ్డి పదవీకాలం పొడిగింపు నిర్ణయం మే 16 నుంచి ఆరునెలల పాటు అమలులో ఉండనుంది.

అధికారులే ప్రజల వద్దకు

- మునిసిపాలిటీల్లో ప్రతి గురువారం ప్రజావాణి
- ప్రతి వార్డులో దరఖాస్తులు స్వీకరణ
- సమస్యల సత్వర పరిష్కారానికి కలెక్టర్ నిర్ణయం
- గతంలో 'కంటి వెలుగు' నిర్వహించిన కేంద్రాల్లోనే



ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి ఇక నుంచి మునిసిపాలిటీల్లోనే ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రజల వద్దకే పాలన తరహాలో ప్రతి గురువారం మునిసిపాలిటీల్లోనే వార్డుల వారీగా ప్రజావాణి కార్యక్రమం నిర్వహించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ జేసీ నారాయణరెడ్డి నిర్ణయించారు. ఇక అధికారులే ప్రజల వద్దకు వెళ్లి దరఖాస్తులు స్వీకరించనున్నారు. సమస్యలు విన్నవించడానికి ప్రజలు ఇక కలెక్టర్ కార్యాలయం, మునిసిపల్ కార్యాలయాలకు రావాల్సిన అవసరం లేకుండా ప్రణాళికలు రూపొందించారు. మునిసిపాలిటీలోని వార్డుల్లో ప్రతి గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ప్రజావాణి నిర్వహించనున్నారు.

\- రామగిరి

ప్రతి సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్ సెల్‌కు నల్లగొండ పట్టణ ప్రజల నుంచి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నందున ఇక నుంచి వార్డులోనే ప్రజావాణి కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రజల సమయం వృథా కాకుండా, వార్డులోనే సమస్యలు పరిష్కారమయ్యేందుకు మార్గం సుగమం అవుతుంది.

ప్రజావాణిలో పాల్గొనే అధికారులు వీరే

మునిసిపాలిటీలోని వార్డుల్లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొననున్నారు. వార్డు సూపర్‌వైజర్(నోడల్ అధికారి), సభ్యులుగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఆర్‌పీ, ఆశా వర్కర్, అంగన్‌వాడీ, విద్యుత్ లైన్‌మన్‌తో పాటు ఆయా వార్డుకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు.

సమస్య చిన్నదైతే అప్పటికప్పుడే పరిష్కారం


ప్రజావాణిలో వచ్చే సమస్యల్లో ఖర్చుతో పనిలేకుండా ఉంటే వాటిని అక్కడికక్కడే పరిష్కరిస్తారు. ఖర్చుతో కూడుకున్నవి అయితే 10రోజుల్లో పరిష్కారమయ్యేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. వార్డులో జరిగే ప్రతీ ప్రజావాణి కార్యక్రమాన్ని మునిసిపల్ కమిషనర్ పరిశీలించి ప్రజల నుంచి వచ్చిన సమస్యలను కలెక్టర్ కార్యాలయానికి నివేదిస్తారు. గతంలో ఆయా వార్డుల్లో కంటివెలుగు కార్యక్రమం నిర్వహించిన కేంద్రాల్లోనే ప్రజావాణి దరఖాస్తులు స్వీకరించనున్నారు. ప్రజల సమయం వృధా కాకుండా, వారి వార్డులోనే సమస్యలు సత్వరం పరిష్కరించేందుకు జిల్లాలోని ఎనిమిది మునిసిపాలిటీల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

18 రకాల సమస్యలపై దరఖాస్తుల స్వీకరణ

- వార్డులో పారిశుధ్యం
- మురుగు నీటి నిర్వహణ
- మంచి నీటి సరఫరా, నూతన కనెక్షన్లు,
- వీధి దీపాల సమస్యలు
- ఇంటి నిర్మాణ అనుమతులు
- గర్భిణుల ఆరోగ్య సమస్యలు, ప్రసవ సేవలు
- శిశు ఆరోగ్య సమస్యలు
- అంటువ్యాధుల నివారణ
- సాధారణ వ్యాధుల చికిత్స సహాయం
- అత్యవసర వైద్య సేవలు
- గృహజ్యోతి పథకం, మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ సమస్యలు
- ఆరోగ్యశ్రీ పథకం సహాయం,
- జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు
- వ్యాపార లైసెన్స్
- చేయూత పింఛన్లు
- మహిళా సంఘాల సమస్యలు
- బ్యాంకు లింకేజ్ వడ్డీ రుణాల సమస్యలు
- కొత్త విద్యుత్ కనెక్షన్లు

గురువారం నుంచి మునిసిపాలిటీల్లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ఈ సమస్యలతోపాటు వార్డులో నెలకొన్న సాధారణ సమస్యలపై కూడా దరఖాస్తులు స్వీకరించనున్నారు.

ప్రజలు ఇబ్బంది పడకూడదనే 'ప్రజావాణి'



సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజలు వాటి పరిష్కారానికి వివిధ కార్యాలయాల చుట్టూ తిరగకూడదనే ఉద్దేశంతో మునిసిపాలిటీలోని అన్ని వార్డుల్లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తారు. కౌన్సిలర్ సహకారంతో ఇక నుంచి ప్రతి గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రజావాణి నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ఎనిమిది శాఖలకు సంబంధించిన సిబ్బంది పాల్గొంటారు. ప్రజలు ఏ సమస్యలు ఉన్నా ప్రజావాణిలో దరఖాస్తు చేయవచ్చు.

\- సయ్యద్ ముసాబ్ అహ్మద్, నల్లగొండ మునిసిపల్ కమిషనర్.

వాహనం బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

చివ్వెంల, జూలై 3: నల్లగొండ జిల్లా చిట్యాల మండల పరిధిలోని ఎల్‌ఎన్‌రావు తండా సమీపంలో గల జాతీయ రహదారిపై బుధవారం బొలెరో వాహనం పల్టీ కొట్టింది. హైదరాబాద్ నుంచి ఖమ్మం వైపునకు వెళ్తున్న క్రమంలో టైర్ పంచర్ కావడంతో వాహనం అదుపుతప్పి పల్టీ కొట్టి రోడ్డు పక్కకు పడింది. ఈ వాహనంలో నారాయణ కళాశాలకు సంబంధించిన ప్రింటింగ్ బుక్స్ ఉన్నాయి. పల్టీ కొట్టిన సమయంలో బుక్స్ అన్ని చెల్లాచెదురుగా రోడ్డుపై పడ్డాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని హైవే పెట్రోలింగ్ సిబ్బంది వెంటనే సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

బాలుడు అదృశ్యం.. కేసు నమోదు



మహేష్(ఫైల్)

చివ్వెంల, జూలై 3: సూర్యాపేట జిల్లాకేంద్రంలోని కుడకుడలోని ఎస్సీ వెల్‌ఫేర్ హాస్టల్ విద్యార్థి మంగళవారం అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన బుధ వారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నల్లగొండ జిల్లా సమీపంలోని పానగల్ గ్రామానికి చెందిన కొడిదల మహేష్ కుడకుడలోని ఎస్సీ హాస్టల్‌లో ఈ విద్యాసంవత్సరంలో చేరాడు. అదే గ్రామంలో ఉన్న జడ్పీ హెచ్‌ఎస్‌లో 6వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం ఉదయం 11గంటల సమయంలో ఇంటర్‌వెల్ సమయంలో తన తాతకు ఫోన్ చేసి హాస్టల్‌లో ఉండనని చెప్పాడు. అనంతరం ఎవరికీ చెప్పకుండా స్కూల్ నుంచి వెళ్లిపోయాడు. బంధువుల ఇళ్లలో ఆరా తీసినా ఆచూకీ లభించలేదని మహేష్ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ. వెంకట్‌రెడ్డి తెలిపారు. బాలుడి ఆచూకీ తెలిస్తే చివ్వెంల ఎస్‌ఐ సెల్: 8712686031కు సమాచారం ఇవ్వాలని కోరారు.

హోటల్‌లో గ్యాస్ సిలెండర్లు చోరీ

శాలిగౌరారం, జూలై 3: నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం గురజాల గ్రామ శివారులోని తుడిమిడి రోడ్డు పక్కన ఉన్న హోటల్‌లో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా నాగారం మండలం ఈటూరు గ్రామానికి చెందిన దాసరి పద్మ శాలిగౌరారం మండలం గురజాల సమీపంలో తుడిమిడి రోడ్డులో ఆరు నెలల నుంచి హోటల్ నిర్వహిస్తోంది. పద్మ మంగళవారం అనారోగ్యానికి గురికావడంతో సాయంత్రం హోటల్ మూసి గురజాలలోని తన అక్క రాచకొండ రాములమ్మ ఇంటికి వెళ్లింది. అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు హోటల్ తలుపులను పగుల గొట్టి అందులో ఉన్న రెండు గ్యాస్ సిలిండర్లు, బియ్యం డబ్బాలో పెట్టిన రూ.10వేల నగదు, రెండు కాటన్ల బీరు బాటిళ్లను ఎత్తుకెళ్లారు. హోటల్ యజమాని పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భవనంపై నుంచి పడి కార్మికుడి మృతి

చిట్యాలరూరల్, జూలై 3: భవన నిర్మాణంలో భాగంగా లిఫ్టును సరిచేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి గాయపడిన కార్మికుడు చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడులో జరిగింది. ఎస్‌ఐ సైదాబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని నెల్లూరు జిల్లా కొండాపురం మండలం సాయిపేటకు చెందిన దోమల మల్లిఖార్జున్(33) వెలిమినేడులో పదేళ్లుగా భవన నిర్మాణ పనులు చేస్తున్నాడు. అందులో భాగంగా ఈ నెల 2వ తేదీన భవనంపై నిర్మాణంలో ఉన్న లిఫ్టును సరిచేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడిపోయాడు. దీంతో మల్లిఖార్జున్ తలకు తీవ్ర గాయం కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్ కామినేని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న బుధవారం మృతిచెందాడు. మల్లిఖార్జున్‌కు కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య మహాలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

15టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

నల్లగొండ క్రైం, జూలై 3: అక్రమంగా తరలిస్తున్న 15 టన్నుల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన నల్లగొండ వన్‌టౌన్ పీఎస్ పరిధిలో బుధవారం జరిగింది. వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణ పరిధిలో చుట్టుపక్కల గ్రామాల్లో కిలో రూ. 9 చొప్పున రేషన్ బియ్యం రైస్‌ను కొనుగోలు చేసి జిల్లాకేంద్రంలోని దేవరకొండ రోడ్డులో ఉన్న వెంకటరమణ మిల్లులో నిల్వ ఉంచిన బియ్యాన్ని అక్రమంగా హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం స్థానిక డీఈవో కార్యాలయం వద్ద విశ్వసనీయ సమాచారం మేరకు డీసీఎం నెంబర్ టీఎస్ 31టీ 1512లో తరలిస్తున్న 300బస్తాల(15 టన్నులు) పీడీఎస్ బియ్యాన్ని వన్‌టౌన్ పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. డీసీఎం డ్రైవర్ మునుకునూతల భిక్షం, మిల్లు యజమాని బండారు రాజుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

వలిగొండలో గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

వలిగొండ, జూలై 3: గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తుండగా యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఎస్‌ఐ మహేందర్‌లాల్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ కుకట్‌పల్లికి చెందిన చేతన్ ప్రకాశ్ మండలకేంద్రంలో కిరాణాషాపు నిర్వహిస్తున్నాడు. గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు షాపును తనిఖీ చేశారు. సాగర్ 420 ప్యాకెట్లు, స్వాగత్ గోల్డ్ 120, ఆర్‌ఆర్ పొగాకు 180, విమల్ 900 పౌచ్‌లు, వీ1 పొగాకు 900, మీరజ్ పొగాకు 60, ఎస్‌ఆర్ 17-420 పౌచ్‌లు, రాజ్ నివాస్ 120 పౌచ్‌లు డబుల్ బ్లాక్ 150పౌచ్‌లు, జెడ్‌ఎల్-1- 90పౌచ్‌ల గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.

పది మంది పేకాటరాయుళ్ల అరెస్టు

నల్లగొండ క్రైం, జూలై 3: పది మంది పేకాటరాయుళ్లను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. నల్లగొండ వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణ పరిధిలోని మహిళా ప్రాంగణం శివారులో పేకాట ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి పేకాడుతున్న పది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి రూ.43,041 నగదు, ఐదు బైకులు, పది సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

అధిక సాంద్రత పత్తి సాగుతో దిగుబడి మెండు

మోత్కూరు, జూలై 3: అధిక సాంద్రత పత్తి సాగుతో అధిక దిగుబడి వచ్చి రైతుల ఆదాయం పెరుగుతుందని జిల్లా ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ బి. అనిల్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి కె. అనురాధ అన్నారు. అధిక సాంద్రత పత్తి సాగు ప్రాజెక్టులో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, యాదాద్రి భువనగిరి జిల్లా ఏరువాక కేంద్రం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మోత్కూరు మునిసి పాలిటీ పరిధిలోని బుజిలాపురం గ్రామంలో చాతరాశి వెంకన్న, మోత్కూరులో మోత్కూరు బ్రహ్మచారి వ్యవసాయ క్షేత్రాల్లో బుధవారం న్యూమాటిక్ ప్లాంటర్‌తో పత్తి విత్తనాలు విత్తే విధానాన్ని ప్రయోగాత్మకంగా విత్తి చూపించారు. పంటల సాగులో కూలీల కొరత నివారించడానికి, సాగు ఖర్చు తగ్గించుకోవడానికి అధునాతన యంత్రాలను వినియోగించుకోవాలన్నారు. రైతులు అధిక సాంద్రత పత్తిసాగు పట్ల దృష్టి సారించాలన్నారు. సన్న, చిన్నకారు రైతులు ఈ ప్రాజెక్టులో పత్తి సాగు చేయవచ్చ న్నారు. న్యూమాటిక్ ప్లాంటర్‌తో ఒక గంటలో ఒక ఎకరం పత్తి విత్తనాలు విత్తవచ్చన్నారు. అధిక సాంద్రత పత్తి సాగు చేసే రైతులకు విత్తనాలు విత్తిన మూడు మాసాలకు ఎకరాకు రూ.5వేల చొప్పున ఐదెకరాలకు మించకుండా సబ్సిడీ ప్రభుత్వం నేరుగా రైతులబ్యాంకు ఖాతాల్లో వేస్తుందన్నారు. ఈ సాగులో పత్తి దిగుబడి ఒకేసారి వస్తుందన్నారు. నవంబరులోనే పత్తితీత పూర్తవుతుందని, దీంతో డిసెంబరు, జనవరిలో వచ్చే గులాబీ పురుగు బెడద ఉండదన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్త కె. మమత మాట్లాడుతూ అధిక సాంద్రత సాగుతో మొక్కల మధ్య దూరం తగ్గి మొక్కలు ఎక్కువగా ఉండి అధిక దిగుబడి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు టి. గోపీనాథ్, ఎం. అశోక్‌కుమార్, జె. సైదులు పాల్గొన్నారు.

చిన్నారి ప్రాణం తీసిన ఏమరుపాటు

బైక్ సహా వంతెనపై నుంచి కిందపడిన చిన్నారి ● తీవ్రగాయాలతో మృత్యువాత



అడ్డగూడూరు, జూలై 3: తండ్రితో కలిసి సరదాగా ద్విచక్ర వాహనంపై బయటకు వచ్చిన ఆ చిన్నారి కొద్దిసేపట్లోనే మృత్యుఒడికి చేరింది. బైక్ ట్యాంక్‌పై కూర్చున్న ఆ చిన్నారి సెల్ఫ్ బటన్‌ను నొక్కటంతో వంతెన కిందికి దూసుకెళ్లి తీవ్రంగా గాయపడి మృత్యువాత పడింది. ఈ విషాద సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలోని చిర్రగూడూరులో బుధవారం సాయంత్రం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిర్రగూడూరు గ్రామానికి చెందిన మోలుగూరి శివ, ఉమారాణిల దంపతులకు ఇక్షీత(3) ఒక్కరే సంతానం. శివ గ్రామంలో చికెన్‌సెంటర్ నిర్వహిస్తుంటాడు. అయితే ప్రతిరోజూ తన కుమార్తెను సాయంత్రం వేళ బైక్‌పై తీసుకెళ్లి వస్తుంటాడు.ఈ క్రమంలో బుధవారం సాయంత్రం కూడా ఇక్షీతను బైక్ ముందు భాగాన ట్యాంక్‌పై కూర్చోపెట్టుకొని తీసుకెళ్లాడు. గ్రామ శివారులోని బిక్కేరు వాగుపై వంతెన వద్దకు వెళ్లగా శివకు ఫోన్ రావడంతో వాహనాన్ని గేరులోనే పక్కకు ఆపి ఫోన్‌లో మాట్లాడుతుండగా ముందు కూర్చున్న ఇక్షీత బైకు సెల్ఫ్ నొక్కింది. దీంతో బైకు స్టార్ట్ అయి ముందుకు వెళ్లి వంతెనపై నుంచి కిందపడి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చిన్నారిని చికిత్స నిమిత్తం వాహనంలో తిరుమలగిరిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సూర్యాపేట జిల్లాకేంద్రంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. చిన్నారిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందిందని తెలిపారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

● నేడు పాఠశాలలు, కళాశాలల బంద్‌కు పిలుపు



నల్లగొండలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నల్లగొండ, దామరచర్ల, వేములపల్లి, దేవరకొండ, మిర్యాలగూడ, జూలై 3: నీట్, నెట్ పరీక్షల లీకేజీపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 4వ తేదీన పాఠశాలలు, కళాశాలలు బంద్ చేయాలని ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, డీవైఎఫ్ఐ విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. అస్తవ్యస్తంగా పరీక్షలు నిర్వహిస్తున్న ఎన్‌టీఏను రద్దు చేయాలని, వెంటనే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బంద్ చేయాలని కోరుతున్నట్లు వారు తెలిపారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, నీట్ స్కామ్‌పై సమగ్ర విచారణ చేపట్టి, నీట్‌ను రద్దు చేయడం వల్ల నష్టపోయిన అభ్యర్థులకు నష్టపరిహారం అందించాలని, ప్రైవేట్‌లో ఫీజు దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశాయి. విద్యార్థులంతా తరగతులను బహిష్కరించాలని సహకరించాలని కోరారు. రాష్ట్రంలో ఫీజు దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

● దామరచర్ల మండలం కేంద్రంలోని ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి వీరన్ననాయక్ మాట్లాడారు. సమావేశంలో నాయకులు విష్ణు, సాగర్, రాహుల్, మణి, శ్రీకాంత్, సాగర్ పాల్గొన్నారు.

● వేములపల్లి మండలకేంద్రంలోని జడ్పీ హైస్కూల్ వద్ద డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పతాని శ్రీను, జగన్, పుట్ట సంపత్, లోకేష్, గోపి, కృష్ణ పాల్గొన్నారు.

● విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వలమాల ఆంజనేయులు, ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి బుడిద వెంకటేష్, ఎన్ఎస్‌యూఐ జాతీయ సోషల్‌మీడియా కోఆర్డినేటర్ కర్నాటి శ్రీకాంత్ కోరారు.

● మిర్యాలగూడలో నిర్వహించిన సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సైదానాయక్ మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డీవైఎఫ్ఐ నాయకులు వదూద్, శ్రీను, ఎస్ఎఫ్ఐ నాయకులు జగన్, నుమాన్, సంపత్, నగేష్ బాబు, కిరణ్ పాల్గొన్నారు.

● మునుగోడులో డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు కట్టా లింగస్వామి, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శులు విప్లవకుమార్, శంకర్ మాట్లాడారు.

● కొండమల్లేపల్లిలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమావత్ లక్ష్మణ్‌నాయక్ బంద్‌కు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో చరణ్, ఇద్ది రాములు, రాకేష్, శాంతి, గణేష్, శాంతి, ఆంజనేయులు పాల్గొన్నారు.

చకిలం శ్రీనివాసరావు సేవలు మరువలేనివి



శ్రీనివాసరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్, మిర్యాలగూడ, జూలై 3: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ సర్దార్ చకిలం శ్రీనివాసరావు సేవలు మరువలేనివని ఆయన కుమారులు, చకిలం శ్రీనివాసరావు, సునీల్ కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ సర్దార్ చకిలం శ్రీనివాసరావు వర్ధంతిని బుధవారం ఆయన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామగిరి సెంటర్‌లోని చకిలం శ్రీనివాసరావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ శ్రీనివాసరావు కమ్యూనిస్టుల ఖిల్లాగా ఉన్న నల్లగొండ జిల్లాను కాంగ్రెస్ కంచుకోటగా మార్చి 30 సంవత్సరాల పాటు నల్లగొండ, రాష్ట్ర రాజకీయాలను శాసించారని పేర్కొన్నారు. ఎంతోమంది పేద, బడుగు, బలహీన వర్గాలను ఆదుకున్న మహానాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చీర పంకజ్‌యాదవ్, నాయకులు కన్నారావు, దత్త గణేష్, కంచనపల్లి రాజేంద్రప్రసాద్, చకిలం వేణుగోపాలరావు, బీరెలి రామచంద్రయ్య, పల్లె రంజిత్ కుమార్, పల్లె రవి, వెంకటేశ్వర్లు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

● బడుగు, బలహీన వర్గాలకు ఆనాడు శ్రీనివాసరావు అండగా ఉండి పెద్ద దిక్కుగా నిలిచాడని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రీనివాసరావు ఆశయ సాధన కోసం పార్టీ శ్రేణులంతా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మునిసిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, పలువురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కత్తుల కోటి, సైదిరెడ్డి, జయకుమార్, సుభాష్ పాల్గొన్నారు.

● మిర్యాలగూడలో మునిసిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ ఆధ్వర్యంలో చకిలం శ్రీనివాసరావు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రిలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహారం అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పగిడి రామలింగయ్య, రంగారావు, మునిసిపల్ మాజీ చైర్మన్ మెరుగు రోశయ్య, ఖాదర్, మలంగం రమేష్, ఉదయభాస్కర్, మధు, గోవిందరెడ్డి, లింగారెడ్డి పాల్గొన్నారు.

వన మహోత్సవంలో అందరూ పాల్గొనాలి



వీటీనగర్‌లో మొక్క నాటుతున్న ఎంపీపీ భవాని

చింతపల్లి, జూలై 3: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో పార్టీలకతీతంగా పాల్గొనాలని ఎంపీపీ కొండూరి భవానీపవన్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని వేంకటేశ్వరనగర్(మాల్)లోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఎమ్మెల్యే బాలునాయక్ జన్మదిన వేడుకల సందర్భంగా మొక్కలు నాటి ప్రజలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మాజీ మండల అధ్యక్షుడు అంగిరేకుల గోవర్ధన్, పూరె లక్ష్మణ్, మాస భాస్కర్, రామిని నగేష్, ఎండీ.ఖలీల్, మండల వైద్యాధికారి వంశీకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యం

● ప్రజలకు అందుబాటులో ఉంటా

● జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, జూలై 3: దేవరకొండ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. ఎమ్మెల్యే బాలునాయక్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు చింతపల్లి నుంచి కొండమల్లేపల్లి మీదుగా దేవరకొండకు చేరుకున్న బాలునాయక్‌కు పెద్ద దర్గా నుంచి భారీ బైక్ ర్యాలీతో బాణసంచాలు పేల్చుతూ ఊరేగింపుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ ఎదుట క్రేన్‌తో ఎమ్మెల్యేకు గజమాల వేసి సత్కరించారు. క్యాంపు కార్యాలయానికి చేరుకున్న బాలునాయక్ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. పార్టీలకతీతంగా అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని అన్నారు. ప్రజలే తన కుటుంబమని, ప్రాణం ఉన్నంతవరకు ప్రజల మధ్యనే ఉండి సేవలందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో దేవరకొండ మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఎంపీపీ జాన్‌యాదవ్, జాల నర్సింహారెడ్డి, టీపీసీసీ సభ్యులు సిరాజ్‌ఖాన్, డాక్టర్ వేణుధర్‌రెడ్డి, దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డి, ముక్కమళ్ల వెంకటయ్యగౌడ్, మారేపాకల అరుణ సురేష్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, వడ్త్య దేవేందర్‌నాయక్, లోకసాని శ్రీధర్‌రెడ్డి, శిరందాసు కృష్ణయ్య, బిక్కునాయక్, హరికృష్ణ, పున్న వెంకటేష్, యూనుస్, సతీష్‌రెడ్డి, పాపనాయక్ పాల్గొన్నారు.



దేవరకొండలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



చింతపల్లిలో రక్తదానం కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

చింతపల్లి: ఎమ్మెల్యే బాలునాయక్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని చింతపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్, ఎంపీపీ కొండూరి భవానీ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు నిర్వహించిన రక్తదాన శిబిరంలో పలువురు పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ యాచారం యాదయ్య, దొంతం సంజీవరెడ్డి, అధికార ప్రతినిధి ముచ్చర్ల యాదగిరి, అంగిరేకుల గోవర్ధన్, ఎరుకల వెంకటయ్యగౌడ్, మాస భాస్కర్, రవి నాయక్, హరినాయక్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

డిండి: డిండి మండల కేంద్రంలో బాలునాయక్ జన్మదిన వేడుకలను డిండి మండలకేంద్రంలోని రాజీవ్‌చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు బాదమోని శ్రీనివాస్‌గౌడ్, పోలం లక్ష్మణ్, సాయి, పోల వెంకటేష్, కలీం, నూకం వెంకటేష్, సలయ, ఖయూం పాల్గొన్నారు.

దేవరకొండ: కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ఎమ్మెల్యే బాలునాయక్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బాలునాయక్‌కు గజమాల వేసి ఘనంగా సన్మానించారు. జడ్పీటీసీ తనయుడు పస్నూరి యుగేందర్‌రెడ్డి ఎమ్మెల్యే జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని జోగ్యతండా వద్ద గల సాలిడార్ బధిరుల ఆశ్రమ పాఠశాలలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ దూదిపాల రేఖ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్‌రెడ్డి, నాయకులు నాయిని మాధవరెడ్డి, ఎంఏ.సిరాజ్‌ఖాన్, ఎల్లయ్య, కుక్కల గోవర్ధన్‌రెడ్డి, కుంభం శ్రీనివాస్‌గౌడ్, కైసర్‌ఖాన్, జగదీష్, గంధం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దఅడిశర్లపల్లి: ఎమ్మెల్యే బాలునాయక్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉమ్మడి పీఏపల్లి మండలంలో ఘనంగా నిర్వహించారు. అంగడిపేట ఎక్స్‌రోడ్డు, గుడిపల్లి మండలకేంద్రంలో నాయకులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం టపాకాయలు కాల్చి ఒకరికి ఒకరు స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వీరమళ్ల పరమేష, గండు సాలయ్య, బోల్లు గోవింద్, షేక్ జహంగీర్, కర్ణయ్య, గండు సుధాకర్,వీరమళ్ల సతీష్‌కుమార్, గురుప్రసాద్, సన్నీ వినోద్, నీలం లక్ష్మయ్య, రమావత్ బిక్షం, బోల్లు సతీష్, గిరి, వెంకటయ్య, కళ్యాణ్‌కుమార్, రమణ పాల్గొన్నారు.



కొండమల్లేపల్లిలో బాలునాయక్‌ను గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

సాగుచేయని భూములకు రైతు భరోసా ఇవ్వవద్దు

పెద్దఅడిశర్లపల్లి, శాలిగౌరారం, జూలై 3: సాగు చేయని భూములకు రైతు భరోసా ఇవ్వవద్దని పలువురు రైతులు పేర్కొన్నారు. పెద్దఅడిశర్లపల్లి, శాలిగౌరారంలోని సింగిల్‌విండో కార్యాలయంలో బుధవారం రైతు భరోసా పథకంపై రైతుల అభిప్రాయ సేకరణ కోసం ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. కొంత మంది రైతులు 10 ఎకరాల వరకు ఇవ్వాలని, మరికొంత మంది 20 ఎకరాలు, ఇంకొందరు భూమి ఉన్న రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలని భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఎక్కువ భూములు ఉన్నవారికి, సాగు చేయని భూములకు రైతు భరోసా ఇవ్వవద్దని, అర్హులైన రైతులకు మాత్రమే రైతు భరోసా ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని అన్నారు.

● పెద్దఅడిశర్లపల్లి మండలకేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు తేరా మణిపాల్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. డీఆర్‌ఏవో గోలి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశానికి ముకుమ్మడిగా 13 మంది డైరెక్టర్లకు ఒక్క చైర్మన్ మాత్రమే హాజరయ్యారు. సీఈవో, చైర్మన్ ఏకపక్ష నిర్ణయాలే గైర్హాజర్‌కు కారణమని గుసగుసలు వినిపిస్తున్నాయి. సమావేశంలో అధికారులు సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఆయుబ్, ఏవో పాండు, సీఈవో వెంకటేశ్వరరెడ్డి, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



పీఏపల్లిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ తేరా మణిపాల్‌రెడ్డి

● శాలిగౌరారంలోని సింగిల్‌విండో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ తాళ్లూరి మురళి, ఏడీఏ రామరావునాయక్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌కుమార్, ఏవో సౌమ్య శృతి, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ సీఎం రెడ్డి, సీఈవో ఆంజనేయులు, నాయకులు రమేష్, సర్వయ్య, డైరెక్టర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి మునిసిపాలిటీలో 'ప్రజావాణి'

చిట్యాల, జూలై 3: చిట్యాల మునిసిపాలిటీలో ప్రతీ గురువారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కమిషనర్ వీరేందర్ తెలిపారు. మునిసిపాలిటీలోని 12 వార్డుల్లో ప్రజావాణి నిర్వహించనున్నట్లు తెలిపారు.

చింతపల్లి: గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సుజాత తెలిపారు. ప్రభుత్వ పథకాల కోసం ప్రజావాణి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని 48 వార్డుల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కమిషనర్ యూసుఫ్ తెలిపారు. రక్షిత తాగునీటి సరఫరా, రహదారులు, పారిశుధ్యం, వీధి దీపాలు తదితర అంశాలపై ఆయా వార్డుల్లో ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. పట్టణ ప్రజలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సమస్యలు తమ దృష్టికి తేవాలన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

దేవరకొండ, జూలై 3: దేవరకొండ నియోజకవర్గంలోని గ్రామాల్లో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా కంటి, వైద్యసేవలు విస్తృతం చేయనున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వస్కుల సత్యనారాయణ అన్నారు. దేవరకొండ మండలం కొండభీమనపల్లిలో బుధవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. లయన్స్‌క్లబ్ అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 110 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 12 మందిని ఆపరేషన్‌కు హైదరాబాద్ తరలించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కార్యదర్శి ప్రభాకర్, జోన్ చైర్మన్ గాజుల రాజేష్, సభ్యులు బిక్షమయ్య, శ్రీనివాస్, చిలుకూరి నిరంజన్, విష్ణువర్ధన్‌రెడ్డి, ఆంజనేయులు, డాక్టర్ హరి, వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశం నిర్వహించాలి

మిర్యాలగూడ టౌన్, జూలై 3: ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని కోరుతూ కౌన్సిలర్లు మునిసిపల్ కమిషనర్ యూసుఫ్‌కు వినతిపత్రం అందజేశారు. వర్షాకాలంలో దోమలు, సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా, కోతుల, పందుల బెడద లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో చేయని అభివృద్ధి పనులు నిర్వహించాలని కోరుతూ కమిషనర్ యూసుఫ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నర్సిరెడ్డి, శేఖర్‌రెడ్డి, అనిత, నక్కబాయమ్మ, జానీ, రామకృష్ణ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

దేవరకొండ, జూలై 3: దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో పడకల సంఖ్య వంద నుంచి రెండు వందల వరకు పెంచి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఐద్వా జిల్లా ప్రధానకార్యదర్శి పాలడుగు ప్రభావతి డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రిని ఆమె సందర్శించి రోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో వసతులు, పడకల వివరాలు, వైద్యసేవల గురించి ఆరా తీసి మాట్లాడారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు పద్మ, పుష్పలత, లక్ష్మి, విజయ్, రమణ, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

'కల్యాణలక్ష్మి' పేదింటి ఆడపిల్లలకు వరం

కట్టంగూరు, జూలై 3: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదింటి ఆడపిల్లలకు వరంలాంటిదని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలకేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన 96మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జెల్లా ముత్తిలింగం, మాజీ జడ్పీటీసీ మాద యాదగిరి, వైస్ ఎంపీపీ గడుసు కోటిరెడ్డి, తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

మండలంలో 38,818 జీవాలు

మాడ్గులపల్లి, జూలై 3: రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న గొర్రెలు, మేకల గణనలో భాగంగా బుధవారం పశు వైద్యాధికారులు మండలంలో గణన చేపట్టారు. మొత్తం 38,818 గొర్రెలు, మేకలు ఉన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా గొర్రెల పెంపకందారుల సహకార సంఘం జిల్లా కార్యదర్శి ఊరిబండి శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ పశుసంవర్ధకశాఖ అధికారులు మండల వ్యాప్తంగా పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. వానాకాలం నేపథ్యంలో జీవాలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్, రైతులు గంట ముసలయ్య, ఆవుల సైదులు, కడారి ముసలయ్య, నాగయ్య, వెంకన్న, శంకర్, సతీష్‌యాదవ్ పాల్గొన్నారు.

అటవీభూముల సమస్యల పరిష్కారానికి చర్యలు

మిర్యాలగూడ, జూలై 3: అటవీ భూముల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని ఆర్డీవో శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలోఓ బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని దామరచర్ల, అడవిదేవులపల్లి, తిరుమలగిరిసాగర్, పెద్దవూర మండలాల్లో అటవీభూముల సమస్య నెలకొందన్నారు. పాత ఎంక్రోచ్‌మెంట్ ప్రకారం సాగు చేసే రైతులకు అన్యాయం జరగకుండా అటవీశాఖ అధికారులు, రెవెన్యూ యంత్రాంగం సమన్వయంతో సమస్యను పరిష్కరించేందుకు ప్రణాళిక రూపొందిస్తామన్నారు. అటవీ భూములకు పూర్తిగా హద్దులు నిర్ణయించి రక్షణ కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పోడు భూములపై నెలకొన్న అడ్డంకులను తొలగిస్తున్నామన్నారు. ఇసుక అక్రమ రవాణా చేస్తూ పట్టుబడితే మొదటిసారి జరిమానా, మరోసారి పట్టుబడితే వాహనం జప్తుతో పాటు యజమానికి జైలుశిక్ష తప్పదని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ భూములు, చెరువు శిఖం భూముల రక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

సంక్షిప్త సమాచారం...

మిర్యాలగూడ టౌన్: వాసవీ క్లబ్ గ్రేటర్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. అనంతరం చిరు వ్యాపారులకు వ్యాపార గొడుగులు, తోపుడు బండ్లు అందజేశారు. నిరాశ్రయులు, పేదలకు దుస్తులు, దుప్పట్లు, పోలీసులకు మాస్కులు పంపిణీ చేశారు.

● ప్రభుత్వం పదోన్నతులు, బదిలీలు చేపట్టడంపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బంజారా ఉద్యోగుల సంఘ రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథ నాయక్ మాట్లాడుతూ ఆటంకాలు ఎదురైనా ఉపాధ్యాయుల మొర ఆలకించి పదోన్నతులు, బదిలీలు చేపట్టిన సీఎం రేవంత్‌రెడ్డి బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

పెద్దఅడిశర్లపల్లి: గుడిపల్లి ఎంపీటీసీ, ఉమ్మడి మండల వైస్ ఎంపీపీ అర్వపల్లి సరితనర్సింహను గుడిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వడ్త్య నవీన్, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

దేవరకొండ: కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ హాజరవుతున్నారని, ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా జర్నలిస్టులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మునుగోడు: మునుగోడు మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.1.78 లక్షలు మంజూరైనట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి వ్యక్తిగత క్యాంపు కార్యాలయంలో ఆ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

పెద్దఅడిశర్లపల్లి: పీఏపల్లి మండలానికి చెందిన గండు సుధాకర్ టీఎమ్మార్పీఎస్ ప్రతినిధిగా నియమితులయ్యారు.

కేతేపల్లి: మండల పరిషత్ పాలకవర్గ పదవీకాలం ముగియడంతో జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ డి.నాగేశ్వరరావును కేతేపల్లి మండల ప్రత్యేక అధికారిగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.


మునుగోడు రూరల్: మండలంలోని గుండ్లోరిగూడెం, చల్మెడ గ్రామంలో నూతన రేషన్‌షాపులను తహసీల్దార్ నరేందర్ ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు రేషన్ బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీటీ నరేష్, నాయకులు పాల్గొన్నారు.


మర్రిగూడ: వానాకాలం ప్రారంభమైనందున గ్రామాల్లో సీజనల్ వ్యాధులు సోకకుండా ఆశావర్కర్లు తగు చర్యలు తీసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ దీపక్ అన్నారు. పీహెచ్‌సీలో ఆశావర్కర్లకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

మాడ్గులపల్లి: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేసి నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లెంల శ్రీకర్ డిమాండ్ చేశారు.

మునుగోడు: దళితమోర్చా మండల అధ్యక్షుడిగా పందుల యాదయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు.

నాయకులకు పదవీ విరమణ ఉండదు





నార్కట్‌పల్లి, నకిరేకల్ ఎంపీపీలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నార్కట్‌పల్లి, నకిరేకల్, కేతేపల్లి, అడవిదేవులపల్లి, తిప్పర్తి, శాలిగౌరారం, కట్టంగూరు, జూలై 3: రాజకీయ నాయకులకు పదవీ విరమణ అనేది ఉండదని, పదవీ కాలం పూర్తవడం కేవలం తాత్కాలిక విరామమేనని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. పదవి అంటే అధికారం కాదని, ప్రజాప్రతినిధులుగా బాధ్యతతో వ్యవహరించి గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములైన ఎంపీటీసీలు అభినందనీయులని ప్రశంసించారు. ప్రజాశీర్వాదంతో మళ్లీ మీరు ప్రజాప్రతినిధులుగా ఎన్నికై ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. ప్రజా సేవ చేసే ప్రజాప్రతినిధులను ప్రజలు ఎప్పుడూ గుర్తుంచుకుంటారని, పదవితో సంబంధం లేకుండా ప్రజాసేవ చేసిన వారే మంచి నాయకులు అవుతారని అన్నారు. జిల్లాలోని నార్కట్‌పల్లి, నకిరేకల్, కేతేపల్లి మండలకేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో బుధవారం నిర్వహించిన చివరి సర్వసభ్య సమావేశంతో పాటు ఆత్మీయ వీడ్కోలు సభకు ఎమ్మెల్యే వీరేశం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కొత్త మండలాల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైన వెంటనే అమ్మనబోలు మండలాన్ని ఏర్పాటు చేస్తామని వీరేశం హామీ ఇచ్చారు. చివరి మండల సభ కావడంతో ఎంపీటీసీల్లో భావోద్వేగం కనిపించింది. ఎంపీటీసీలను శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు.

● నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి అధ్యక్షతన సమావేశంలో ఎమ్మెల్యే వీరేశం పాల్గొని మాట్లాడారు. బీ.వెల్లెంల ఉదయ సముద్రం ప్రాజెక్టును భూసేకరణ కోసం రూ.150 కోట్లు, డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం కోసం రూ.100 కోట్లు కలిపి మొత్తం రూ.250 కోట్లను వచ్చే బడ్జెట్‌లో కేటాయించేలా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అదేవిధంగా నార్కట్‌పల్లిలో చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల పూర్తికి అదనంగా కావాల్సిన నిధులు, మాంద్రలో నిర్మాణంలో ఉన్న సబ్ మార్కెట్ యార్డులో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయిస్తానని ప్రకటించారు. అంతకుముందు నార్కట్‌పల్లిలో నూతనంగా నిర్మించిన గౌడ సంఘం భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో వైస్‌ఎంపీపీ కల్లూరి యాదగిరి, కాంగ్రెస్ నాయకులు బత్తుల ఊశయ్య, ఎంపీటీసీ పాశం శ్రీనివాస్‌రెడ్డి, బండ సాగర్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, సట్టు సత్తయ్య, అచ్చాలు, భరత్, సత్యం, సమద్, స్వామిగౌడ్, కొండయ్య, మహేష్, రమేష్, ఎంపీడీవో ఉమేష్‌చారి, తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

● కేతేపల్లిలో నిర్వహించిన ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీల వీడ్కోలు సమావేశంలో ఎమ్మెల్యే వీరేశం పాల్గొని మాట్లాడారు. ప్రజాప్రతిధులు తమ పదవీకాలంలో చేసిన అభివృద్ధి పనులు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, ఎంపీపీ పి.శేఖర్, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఏవో పురుషోత్తం, జడ్పీటీసీ బి.స్వర్ణలత, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

● తిప్పర్తిలో ఎంపీపీ నాగులవంచ విజయలక్ష్మీ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో జడ్పీటీసీ రాంరెడ్డి మాట్లాడారు. సేవచేసే ప్రజాప్రతినిధులను ప్రజలు ఎప్పుడూ గుర్తుంచుకుంటారని అన్నారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారి ఈఈ భూమన్న, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి, నల్లగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, నాయకులు ముత్తినేని శ్యాంసుందర్, జానయ్య, శ్రీను, మోషె, రవీందర్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

● శాలిగౌరారంలో నిర్వహించిన సమావేశంలో ప్రజలు ఎన్నుకున్న తమకు ఎంపీటీసీ పదవి వల్ల ఒరిగిందేమీ లేదని, అసలు ఎంపీటీసీ వ్యవస్థనే రద్దు చేయాలని పలువురు ఎంపీటీసీలు అభిప్రాయపడ్డారు. ఎంపీడీవో సుందరయ్య అధక్షతన ఎంపీటీసీలకు ఆత్మీయ, వీడ్కోలు అభినందన సభ నిర్వహించారు. సమావేశంలో ఎంపీపీ గంట లక్ష్మమ్మ, జడ్పీటీసీ ఎర్రబెల్లి యాదగిరి, వైస్ ఎంపీపీ కందుల అనితఅరళారెడ్డి పాల్గొన్నారు.

● నకిరేకల్‌లో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారం కోసం అధికారులు ఎప్పటికప్పుడు చొరవ చూపాలని అన్నారు. ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి గంగాధర్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు సమస్యలపై చర్చించారు. సమావేశంలో ఎంపీడీవో చంద్రశేఖర్, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు టీగల జాన్‌శాస్త్రి, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

● కట్టంగూరులో నిర్వహించిన ప్రజాప్రతినిధుల వీడ్కోలు సమావేశానికి ఎమ్మెల్యే వీరేశం పాల్గొన్నారు. ప్రజా సంక్షేమం కోరుకునే వారు నాయకులుగా తప్పక ఎదుగుతారన్నారు. అనంతరం పదవీ విరమణ పొందుతున్న ఎంపీపీ జెల్లా ముత్తి లింగం, వైస్ ఎంపీపీ గడుసు కోటిరెడ్డి, ఎంపీటీసీ మాద యాదగిరి, ఎంపీటీసీలను ఎమ్మెల్యే పూలమాలలు, శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. సమావేశంలో ఎంపీడీవో జ్ఞానప్రకాశ్‌రావు, తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, సూపరింటెండెంట్ చింతమల్ల చలపతి, ఏపీవో రాంమోహన్, ఏపీఎం సైదులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.